ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 43 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 27 మే 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# ప్రతి కుటుంబానికి
# సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయం

### ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'
### సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు
### భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం



**హైదరాబాద్, మే 26 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ..మిగతా 2లో



## అనర్హుల పేర్లను మాత్రమే
# తొలగించాలి

### అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే
### సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు

**హైదరాబాద్, మే 26 (ప్రభాత ఉదయం)**

భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) జి.ఎస్. చారిలతో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ ..మిగతా 2లో

# గవర్నర్‌ను కలిసిన కవిత
## రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

### భూసేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత
### ఖమ్మం, పరిగి, ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత
### రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
### బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరిక



**హైదరాబాద్, మే 26 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ..మిగతా 2లో

## ధాన్యం కొనుగోళ్లలో
# ప్రభుత్వం విఫలం
### కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

**కరీంనగర్, మే 26 (ప్రభాత ఉదయం)**



రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా విఫలం అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ పక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్ని రకాల ..మిగతా 2లో



## ప్రొఫెసర్ నాగేశ్వర రావు
# అరెస్ట్‌కు రంగం సిద్ధం
### జనసేనాని పవన్‌పై వ్యాఖ్యలు
### డిజిపి ఆనందంను కలిసి రక్షణ కల్పించాలన్న నాగేశ్వర్

**హైదరాబాద్, మే 26 (ప్రభాత ఉదయం)**

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ పోలీసులు అరెస్ట్ ..మిగతా 2లో

## చొరబాటుదారులూ
# పారిపోండి



### వెళ్లగొట్టక ముందే పారిపోతే మంచిది
### జైల్లో పెట్టి తిండి పెట్టేది లేదు
### బంగ్లాదేశ్ వలసదారులకు సిఎం సువేందు హెచ్చరిక
### సరిహద్దుల వద్దకు చేరుకుంటున్న అక్రమవలసదారులు

2



## సిఎన్‌జి ధరలు మరోసారి
# పెంచిన కేంద్రం
### వాహనదారులపై మళ్లీ పిడుగు
### వరుసగా నాలుగోసారి పెరిగిన ధరలు

**న్యూఢిల్లీ, మే 26 (ప్రభాత ఉదయం)**

కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచింది. కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం ..మిగతా 2లో

## నేడు ఢిల్లీకి
# తమిళనాడు సిఎం విజయ్
### ప్రధాని మోడీతో భేటీకి అవకాశం

**చెన్నై, మే 26 (ప్రభాత ఉదయం)**



తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ బుధవారం ఢిల్లీ పర్యటన చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీని కలిసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించారు. బుధవారం ఉదయం సీనియర్ అధికారులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో సహా విజయ్ ఢిల్లీకి చేరుకోనున్నారు. అలాగే ఈ పర్యటనలో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ, రాహుల్ గాంధీని ఆయన కలవనున్నారు.

# చొరబాటుదారులూ పారిపోండి

**కోల్‌కతా, మే 26 (ప్రభాత ఉదయం)**

పశ్చిమబెంగాల్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమవలసదారులపై చర్యలను సువేందు అధికారి ప్రభుత్వం ముమ్మరం చేసింది. అక్రమవలసదారులను వారి స్వదేశానికి పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారుల పై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 'ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే పారిపోండి' అంటూ ముఖ్యమంత్రి తాజాగా హెచ్చరించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల అంశంపై మాట్లాడుతూ, కొత్త చట్టంతో కాకుండా ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించ డానికి సిద్ధంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని తెలిపారు. బంగ్లా అక్రమ చొరబాటుదారులను జైళ్లకు పంపవద్దని తాను పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. 'వారికి మనమెందుకు ఆతిథ్యం ఇవ్వాలని దేశ వనరులను మనం ఎందుకు దుర్వినియోగం చేయాలి. చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా?' అని ప్రశ్నించారు. బంగ్లా పౌరులు స్వచ్ఛందంగా, శీఘ్రంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్దఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం 'గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి' అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# గవర్నర్‌ను కలిసిన కవిత

**మొదటి పేజీ తరువాయి...**

ఇళ్ల కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కద్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన



ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు.

తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, పరిగి, ఆర్ఆర్ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షిక విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు.

## ట్రిబుల్ ఐటీ జంక్షన్ వద్ద రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ

**శేరిలింగంపల్లి : మే 26,(ప్రభాత ఉదయం)**

ఐటీ కారిడార్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న మల్టీ లెవల్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ నిర్మాణ పనులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించిన ఆయనకు నిర్మాణ పనులు జరుగుతున్న తీరును సిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు సైబరాబాద్ ట్రాఫిక్ విభాగ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను సీపీ పరిశీలించారు. నిర్మాణ కాలంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.



ట్రిబుల్ ఐటి జంక్షన్ పనులు పరిశీలిస్తున్న సీపీ తోపాటు సీఎంసీ అధికారులు.

**సీపీ ముఖ్య సూచనలు**

ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్య ప్రాంతాల్లో స్పష్టమైన సూచిక బోర్డులు బ్యారికేడ్లు, రాత్రి వేళల్లో మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేయాలి. రద్దీ ఎక్కువగా ఉండే పాయింట్లలో ట్రాఫిక్ సిబ్బందిని అదనంగా నియమించాలి. ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీపీ స్పష్టం చేశారు. కమీషనర్ తోపాటు ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి ఇంజినీరింగ్ విభాగ అధికారులు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నమ్మితే నట్టేటే.. 'ఆన్‌లైన్' బాబాల సైబర్ మాయాజాలం!

**జ్యోతిష్య, తంత్రాల పేరుతో వల విసురుతున్న కేటుగాళ్లు..**
**సైబరాబాద్ డిసిపి టి. సాయి మనోహర్ తీవ్ర హెచ్చరిక**

**శేరిలింగంపల్లి : మే 26, (ప్రభాత ఉదయం)**

మీకు ఆర్థిక సమస్యలు ఉన్నాయా? ప్రేమించిన వారు దూరమయ్యారా? వ్యాపారంలో నష్టాలు వస్తున్నాయా? ఒక్క ఫోన్ కాల్‌తో మీ సమస్యలన్నీ పటాపంచలు చేస్తాం.. ప్రస్తుతం సోషల్ మీడియాను ఓపెన్ చేస్తే చాలు ఇలాంటి ఆకర్షణీయమైన ప్రకటనలు వెల్లువెత్తుతున్నాయి. మన బలహీనతలను, కష్టాలను ఆసరాగా చేసుకుని, దేవుడి పేరుతో కొందరు సైబర్ కేటుగాళ్లు డిజిటల్ దందాకు తెరలేపారు. సమస్యల సుడిగుండంలో ఉండి మానసిక ప్రశాంతత కోసం ఆన్‌లైన్ బాబాలను ఆశ్రయిస్తున్న అమాయక ప్రజలను నట్టేట ముంచుతున్నారు. 'ఆన్‌లైన్ జ్యోతిష్యం తోపాటు తంత్ర సేవల' పేరుతో జరుగుతున్న ఈ సరికొత్త సైబర్ మోసాలపై సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి. సాయి మనోహర్ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పరిహారం పేరుతో మొదలై.. భయపెట్టి లాగేస్తున్నారు! ఈ తరహా మోసాల్లో సైబర్ నేరగాళ్లు ఇన్స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి ప్లాట్‌ఫార్మ్‌లను వేదికగా చేసుకుంటున్నారు. శాంతి పూజలు, వశీకరణ, కుటుంబ కలహాల పరిష్కారం, అంటూ నకిలీ అకౌంట్లు, ఫేక్ ఫోటోలు, తప్పుడు రివ్యూలతో ప్రజలను నమ్మిస్తున్నారు. మొదట చాలా తక్కువ ఫీజుతో పూజలు లేదా జ్యోతిష్యం చెబుతామని నమ్మిస్తారు. రెండో సారి దోషాలు ఉన్నాయని భయపెడుతూ వాటి నివారణకు పెద్ద ఎత్తున హోమాలు చేయాలని చెప్పి విడతల వారీగా పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తారు. మూడో దశలో బాధితులు డబ్బులు ఇవ్వడం ఆపేసినా లేదా వారిని బ్లాక్ చేసినా అసలు స్వరూపం బయటపెడతారు. వాట్సాప్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా బెదిరింపులకు దిగుతారు. పూజల కోసం పంపిన వ్యక్తిగత ఫోటోలను, వివరాలను సోషల్ మీడియాలో పెడతామని, కుటుంబ సభ్యులను అంతం చేస్తామని మానసిక ఒత్తిడికి గురిచేసి లక్షల రూపాయలు గుంజుతున్నారు. ఒకే గ్యాంగ్ వేర్వేరు పేర్లతో అనేక అకౌంట్లు నిర్వహిస్తూ ఈ



మీడియాతో మాట్లాడుతున్న సైబరాబాద్ డిసిపి టి. సాయి మనోహర్

దందాను సాగిస్తోందని పోలీసులు గుర్తించినట్లం డీసీపీ తెలిపారు. ఈ డిజిటల్ మాయగాళ్ల వలలో పడకుండా ఉండటానికి సైబరాబాద్ పోలీసులు కింది జాగ్రత్తలు సూచించారు. సోషల్ మీడియాలో కనిపించే తక్షణ పరిష్కారాలు జ్యోతిష్య, తంత్ర, వశీకరణ ప్రకటనలను గుడ్డిగా నమ్మకండి. తెలియని వ్యక్తులకు, అపరిచిత ఆన్‌లైన్ బాబాలకు డబ్బులు పంపే ముందు వారి నమ్మకత్వాన్ని పూర్తిగా పరిశీలించాలని సూచించారు. మీ వ్యక్తిగత ఫోటోలు, కుటుంబ సమాచారం లేదా బలహీనతలను అపరిచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని చెప్పారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటిపి లు, యూపీఐ పిన్ లను ఎవరికీ చెప్పవద్దన్నారు. ఎవరైనా మిమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తే భయపడకుండా వెంటనే పోలీసులనుఆశ్రయించండి. మోసపోతే వెంటనే ఏం చేయాలి ఒకవేళ మీరు ఇలాంటి మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి వివరించారు.

# బక్రీద్‌ను ప్రశాంతంగా పరిశుభ్రంగా జరుపుకుందాం

**జంతు వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.. జూమ్ సమావేశంలో సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్**

**శేరిలింగంపల్లి : మే 26 (ప్రభాత ఉదయం)**

రాబోయే బక్రీద్ పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ పిలుపునిచ్చారు. పండుగను పరిశుభ్రంగా, ప్రజారోగ్యానికి భంగం కలగకుండా నిర్వహించేందుకు మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ, పోలీస్ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమన్వయ జూమ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో శాంతిభద్రతలు పారిశుధ్య నిర్వహణపై అధికారులకు సీపీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా జంతు వ్యర్థాల సక్రమ నిర్వహణపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈద్ గాలు, మసీదులు, నివాస ప్రాంతాల వద్ద వ్యర్థాల సేకరణ కోసం మందమైన నల్ల పాలిథిన్ కవర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సీపీ సూచించారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, ఆ కవర్లలోనే సేకరించి తరలించేందుకు తగినన్ని ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు, ప్రజా ప్రదేశాల శుభ్రత కోసం సరిపడా వాటర్ ట్యాంకర్లు పారిశుధ్య సిబ్బందిని సిద్ధం చేయాలని సీపీ ఆదేశించారు. దుర్వాసన నివారణకు, కీటకాలు ప్రబలకుండా ఉండేందుకు అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ, పోలీస్ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక అధికారులను నియమిస్తున్నామని వీరు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం



:(3) బక్రీద్ పండుగ విషయమై జూమ్ మీటింగ్ పోలీసు అధికారులకు సూచనలిస్తున్న సీపీ ఇతర అధికారులు..

చేసుకుంటూ ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే స్పందిస్తారని వివరించారు. పండుగ వేళ పరిశుభ్రత, ప్రజారోగ్యం, సామరస్య వాతావరణాన్ని కాపాడటంలో ప్రజలందరూ పోలీసులకు, అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సైబరాబాద్ ఎస్బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు పలువురు సీనియర్ పోలీస్ అధికారులు ఎస్‌హెచ్‌ఓలు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి

**మొదటి పేజీ తరువాయి...**

రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ ప్రక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ ప్రక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రక్రియ నిర్వహణలో పాలుపంచుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**మొదటి పేజీ తరువాయి...**

వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరుతో యాత్రలు నిర్వహిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## సిఎన్‌జి ధరలు మరోసారి పెంచిన కేంద్రం

**మొదటి పేజీ తరువాయి...**

నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సీఎన్‌జీ ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా.. అనంతరం రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సీఎన్‌జీ ధరలు పెరిగినట్లయ్యింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదారులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం నాడు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49 నుంచి రూ. 95.20కి పెరిగింది.

## ప్రొఫెసర్ నాగేశ్వర రావు అరెస్ట్‌కు రంగం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఆంధ్రా పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారన్న వార్తల నేపథ్యంలో నాగేశ్వర్ రావు ఇంటి వద్ద తెలంగాణ పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలో నాగేశ్వర్ రావు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. తనకు భద్రత కల్పించాలని డీజీపీని కోరారు. కాగా, తెలంగాణ రాష్ట్రంలో అరెస్ట్ చేయాలంటే ఇక్కడి పోలీసుల అనుమతి ఉండాలని, లేకపోతే అది అక్రమ అరెస్టుగా పరిగణించాల్సి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు అరెస్టుకు అనుమతి ఇస్తారా లేక అరెస్టును అడ్డుకుంటారా అని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ అరెస్ట్ చేసేందుకు వస్తే హైకోర్టులో అరెస్ట్ కాన్సిల్ చేసేందుకు రిట్ పిటిషన్ దాఖలు చేసే ఆలోచనలో ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు ఉన్నట్లు సమాచారం.

# విద్యుత్ వినియోగానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు పెంచుతున్నాం





గగన్ పహాడ్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో సామర్థ్యం పెంచిన పిటిఆర్ లను ప్రారంభిస్తున్న టీజీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు, సీజీఎం పాండ్యా నాయక్

### టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నరసింహులు

**రాజేంద్రనగర్, మే 26(ప్రభాత ఉదయం)**

విద్యుత్ వినియోగదారులందరికీ నిరంతరాయ , నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా సంస్థ ముందుకు వెళుతుందని టిఎస్ఎస్పిడిసిఎల్ డైరెక్టర్ ( ఆపరేషన్) నరసింహులు అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్ సబ్ స్టేషన్ లో డివిజన్ డివిజనల్ ఇంజనీర్ పి రత్నాకర్ రావు ఆధ్వర్యంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్తు సామర్థ్యం పెంచిన పి టి ఆర్ ను ఎస్ ఈ శ్రీరామ్మోహన్, సిజిఎం పాండ్యా నాయక్ ల తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నరసింహులు మాట్లాడుతూ 2.10 కోట్ల రూపాయలతో సబ్ స్టేషన్ లో ప్రస్తుతం ఉన్న పీటీఆర్-×× సామర్థ్యాన్ని 12.5 ఎం వి ఏ నుండి 16 ఎంవీఏకు పెంచడం జరిగిందన్నారు. పెరుగుతున్న విద్యు లోడ్ డిమాండ్‌ను తీర్చడానికి మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా గగన్‌పహాడ్ 33/11 కె.వి సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 12.5 ఎంవిఏ నుండి 16 ఎంవి ఏ కు పెంచడం జరిగిందన్నారు. ఈ నవీకరించిన ట్రాన్స్‌ఫార్మర్, మెట్రో మాల్ గగన్‌పహాడ్ విల్, ఎస్.సి. కాలనీ, కయ్యూమ్ వెంచర్, కరాచీ బేకరీ, గోశాల, పుకత్‌నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, ఆర్‌ఈసి, బడ్వెల్ రైల్వే స్టేషన్, పరివార్ ధాబా, ప్రెస్టీజ్, డైమండ్ కాంటా ప్రాంతాలలోని వినియోగదారులకు స్థిరమైన , నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తుందన్నారు. ప్రధానంగా వేసవి కాలంలో అధిక లోడ్ పరిస్థితులను , విద్యుత్ అంతరాయాలను తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ విద్యుత్ డిఇ(లైన్స్ ) చంద్రశేఖర్, డి ఈ (టి ఆర్ ఇ) టి. భాస్కర్ రావు, అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఔటర్ రింగు రోడ్డు పై వాహనాలను నిలుప వద్దని అవగాహన కల్పిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎసీపీ రామక్రిష్ణ, ఇన్స్ పెక్టర్ సీ హెచ్ రాజు లు

## ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయవద్దు: ట్రాఫిక్ పోలీసులు

**బుద్వేల్, మే 26 (ప్రభాత ఉదయం)**

ఔటర్ రింగ్ రోడ్డు పై ఆగి ఉన్న లారీ లను వెనుకాల నుంచి ఢీ కొట్టిన సంఘటనలలో పలువురు మరణిస్తున్న నేపథ్యంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఔటర్ రింగురోడ్డు పై వాహనాలను నిలపరాదంటు ప్రచారం చేస్తున్నారు. కరపత్రాలు పంపిణీ చేసి డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో బాగంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ కె రామక్రిష్ణ, ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు, ఐఆర్ బీ, ఔటర్ రింగ్ రోడ్డు సిబ్బంది ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఎక్సిట్ వద్ద, టోల్ ప్లాజా ల వద్ద నిలబడి వాహనాలు నడిపే వారికి ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలు ఆపరాదంటు కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ఔటర్ రింగ్డుపై వాహనాలను పార్క్ చేస్తే తీవ్రమైన ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. వేగంగా ప్రయాణించే వాహనాలను ఆటంకం కలిగిస్తుందన్నారు.




వాహన దారులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు




జాయ్ హాస్పిటల్ వద్ద గొడవ పడుతున్న శ్రీనివాస రావు బంధువులు



శ్రీనివాస రావు

## ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఓ వ్యక్తి మృతి

### బంధువుల ఆందోళన

**బుద్వేల్, మే 26 (ప్రభాత ఉదయం)**

ఆసుపత్రి లో గుండెకు స్టంట్ వేసే సమయంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీంతో ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన కు దిగారు. ఆ వ్యక్తి మరణానికి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, బాదితెల కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి..... అత్తాపూర్ సర్కిల్ మధుబన్ కాలనీకి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి శ్రీనివాస రావు ( 45) కు సోమవారం రాత్రి చాతిలో నొప్పి రావడంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో చికిత్స జరిపించారు. నొప్పి తగ్గకపోవడంతో మంగళవారం అత్తాపూర్ లోని జాయ్ హాస్పిటల్ కు తీసుకువచ్చారు. ఆసుపత్రి లో డాక్టర్లు శ్రీనివాస రావు కు యాంజియోగ్రామ్ పరీక్షలు చేశారు. గుండెలో ఎడమ వైపు 90శాతం, కుడి వైపు 10 శాతం బ్లాక్ లు ఉన్నట్లు గుర్తించారు. చికిత్స లో బాగంగా గుండెకు స్టంట్ వేసే ప్రక్రియ ప్రారంభించారు. స్టంట్ వేస్తున్న సమయంలో శ్రీనివాస రావు మృతి చెందారు

**వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటు ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు**

ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే శ్రీనివాస రావు మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు, బందువులు ఆందోళన కు దిగారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని స్టంట్ పేరిట ప్రాణాలు తీశారని ఆరోపించారు. మృ తునికి 7 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. ఆ బాలుడు తండ్రి కోసం రోదిస్తున్న తీరు అందరిని కలచివేసింది. శ్రీనివాస రావు మంచి క్రికెట్ ఆటగాడని, ఎప్పుడు ఉషారుగా ఉండేవాడని స్థానికులు గుర్తు చేస్తున్నారు.

**సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిన అత్తాపూర్ పోలీసులు :**


అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత జరుగుతున్న విషయాన్ని గురించి తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఎలాంటి గొడవలు జరుగకుండ పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు. మృతుడు శ్రీనివాస రావు బావమరిది రాజేశ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆసుపత్రిలో మృతి చెందిన శ్రీనివాస రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్గం నివేధిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలిసే అవకాశముందని పోలీసులు తెలిపారు.


# తపాలా బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలి

### హైదరాబాద్ సెంట్రల్ సబ్ డివిజన్ అసిస్టెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ కె.ఈ. జోయెల్

**రాజేంద్రనగర్, మే 26 (ప్రభాత ఉదయం)**

తపాలా బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ సబ్ డివిజన్ అసిస్టెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ కె.ఈ. జోయెల్ ప్రజలను కోరారు. మంగళవారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ గణేష్ నగర్ లో తపాలా శాఖ , ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ), స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ప్రమాద బీమా పాలసీ కింద 10 లక్షల రూపాయల ప్రమాద మరణ బీమా క్లెయిమ్ ను బాధిత కుటుంబానికి అందించారు.కాటేదాన్ ప్రాంత నివాసి, దివంగత బోయిని మొగులన్న, కూలీ వృత్తిలో ఉన్న ఆయన, రూ. 559 ప్రీమియం చెల్లించి ప్రమాద బీమా పథకంలో చేరారు. దురదృష్టవశాత్తు, వనపర్తి జిల్లా కాతేపల్లి గ్రామంలో బావిలో ప్రమాదవశాత్తు పడి ఆయన మరణించారు.క్లెయిమ్ మొత్తం రూ. 10 లక్షలను మృతుని భార్య, నామినీ అయిన బోయిని పద్మకు, తపాలా శాఖ, ఐపీపీబీ , స్టార్ హెల్త్ బృందాల సమన్వయంతో క్లెయిమ్ పరిష్కార ప్రక్రియలో భాగంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...తపాలా శాఖ ఐపీపీబీ సులభంగా, సరసమైన బీమా పథకాల ద్వారా పౌరులకు ఆర్థిక భద్రత , బీమా సహాయాన్ని అందజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐపీపీబీ సీనియర్ మేనేజర్ సిహెచ్ శోభ, ఐపీపీబీ ఎగ్జిక్యూటివ్ ఉజ్మా ఖానం,స్టార్ హెల్త్ క్లస్టర్ మేనేజర్ జై పవన్ కుమార్,ఓఏ వెంకట్ రెడ్డి, ఎస్‌పీఎం కాటేదాన్ ఆర్ ప్రసాద్,పోస్ట్ మెన్ టి శివకుమార్,ఆర్. శివ, ప్రత్యూష, మహమ్మద్ జియావుల్ హక్,జాబిలి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి రూ 10 లక్షల చెక్కును అందచేస్తున్న తపాల శాఖ అధికారులు

## ప్రమాద భీమా చేయించుకున్న వ్యక్తి మరణించడంతో అతని కుటుంబానికి రూ. 10లక్షల చెక్కు అందజేత

**బుద్వేల్, మే 26 (ప్రభాత ఉదయం)**

కాటేదాన్ ప్రాంతానికి చెందిన బోయిని మొగులన్న తపాల శాఖ, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ), స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో రూ. 10 లక్షల ప్రమాద భీమా కోసం 559 ప్రిమియం చెల్లించారు. వనపర్తి జిల్లా కాతేపల్లి గ్రామంలో బావి లో ప్రమాదవశాత్తు పడి మరణించారు. క్లెయిమ్ మొత్తం అయిన రూ.10లక్షలను మృ తుని భార్య బోయిని పద్మకు మంగళ వారం తపాల శాఖ, ఐపీపీబీ, స్టార్ హెల్త్ బృందాల సమన్వయంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ కె ఈ జోయెల్, ఐపీపీబీ సీనియర్ మేనేజరు సీహెచ్ శోభ, అధికారులు ఉజ్మా ఖానం, జె పవన్ కుమార్, వెంకట్రెడ్డి,ఆర్ ప్రసాద్, టి శివకుమార్, ఆర్ శివ, ప్రత్యూష, మహ్మద్ జియా ఉల్ హక్, జాబిలి లు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో ఓ యువకునికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50వేల జరిమాన

**బుద్వేల్, మే 26 (ప్రభాత ఉదయం) :**



చిలుకూరు సందీప్ కుమార్ అలియాస్ శ్యామ్

లైంగిక దాడి, ఫోక్సో చట్టం కేసులో నిందితునిగా ఉన్న ఉప్పర్ పల్లి ఎర్రబోడ ప్రాంతానికి చెందిన రాములు కుమారుడు చిలుకూరు సందీప్ కుమార్ అలియాస్ శ్యామ్ (20) కు రంగారెడ్డి జిల్లా కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేల జరిమాన విధించింది. బాధితురాలు కుటుంబానికి రూ.3లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు వెలువరిచారు. వివరాలను రాజేం ద్రనగర్ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ వెల్లడించారు. 2019 లో ఈ కేసు నమోదు అయింది. అప్పట్లో రాజేంద్రనగర్ ఏసీపీ గా పనిచేసిన కె అశోక చక్రవర్తి ఈ కేసు లో ఐ ఓ గా ఉన్నారు. నాలుగు సంవత్సరాల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా సందీప్ కుమార్ ఆ బాలిక పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో బాలిక తల్లి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## గగన్ పహాడ్‌లోని చెరువులను కాపాడాలి

### హైడ్రా కు ఫిర్యాదు చేసిన బీ ఆర్ ఎస్ నాయకులు శీలం తిరుపతి రెడ్డి

**బుద్వేల్, మే 26 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని గగన్ పహడ్ లో ఉన్న చెరువులను కాపాడాలని బీఆర్ఎస్ సీనియర్ నేత శీలం తిరుపతి రెడ్డి కోరారు. చెరువులలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, ఆ చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్ది అందరికి అం దుబాటులోకి తీసుకురావాలన్నారు. రాణిగంజ్ బుద్ధ భవన్ లో గల హైడ్రా కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగానాథ్ కు ఆయన మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శీలం తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, గగన్పహాడ్ మామిడికుంట చెరువు (లేక్ ఐడీ - 2931) శిఖం పట్టా అని, ఆ చెరువును మట్టితో, రాళ్లతో పూడ్చి ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. గగన్ పహాడ్ అప్పచెరువు (లేక్ ఐడీ 2900) లోకి పైనుంచి నీరు రాకుండ కట్టడాలు కట్టారని, వాటిని తొలగించి అప్ప చెరువుకు పూర్వపు స్థితిని తీసుకురావాలన్నారు. గగన్ పహాడ్ లోని మరో చెరువు బ్రాహ్మణ చెరువు (లేక్ ఐడీ 2930) ను ప్రైవేటు కంపెనీ యాజమాన్యం తమ స్థలంలో కలుపుకుని ఇతరులను అక్కడికి వెళ్లకుం డా చేశారని. ఆ చెరువును కాపాడి, అభివృద్ధి చేసి ప్రజలు చెరువు వద్దకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టూరా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి పాదచారులకు, చిన్నారులకు, వృద్దులకు ఆడుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. గగన్ పహాడ్ పెద్ద చెరువు (లేక్ ఐడీ 2921) 90 ఎకరాలలో విస్తరించి ఉంటుందని, ప్రస్తుతం ఆ చెరువు ప్రైవేటు వ్యక్తుల కంబంధ హస్తాలలోకి వెళ్లిపోయిందన్నారు. ఆ చెరువును దత్తత తీసుకున్నామని చెబుతున్న ప్రైవేటు వ్యక్తులు తమ స్వంత చెరువులా దాన్ని వాడుకు ంటున్నారని, స్థానికులకు ఆ చెరువు వద్దకు వెళ్లకుండ దారిని మూసేశారని వాపోయారు. విశాలమైన పెద్ద చెరువు ను అభివృద్ధి చేసి, పార్కుగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో గగన్ పహాడ్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అనేక బహుళ అం తస్థులు ఇక్కడ నిర్మాణం జరుగుతున్నాయని, వారందరికి సేద తీరడానికి పెద్ద చెరువు ఉప యోగకరం గా ఉంటుందన్నారు. స్పందించిన హైడ్రా అధికారులు 15 రోజులలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని శీలం తిరుపతి రెడ్డి తెలిపారు.



## వార్డు అభివృద్ధికి నిధుల కేటాయింపుపై వార్డు సభ్యుల హర్షం

**పటాన్ చెరు,మే 26( ప్రభాత ఉదయం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీకి కేటాయించిన 15 కోట్ల నిధులలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీలోని అన్నారం గ్రామం 4వ వార్డులో వెంకటసాయి, రేణుక,ప్రకృతివనం కాలనీల ప్రధాన రహదారికి 72 లక్షల 50 వేల నిధులతో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేయడం పట్ల ఆ వార్డు సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మంగళవారం ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఛైర్మన్ కుమార్ గౌడ్,మాజీ సర్పంచ్ గోకర్ జయశంకర్ గౌడ్,చిమ్ముల గోవర్ధన్ రెడ్డి,కౌన్సిలర్ సంజీవ రెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.4వ వార్డులో ఉన్న అతి పెద్ద సిమెంట్ రోడ్డుకు నిధుల కేటాయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి 4వ వార్డు కౌన్సిలర్ గోకర్ నిర్మలవేణు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరితగతిన నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్డు పనులను పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ శ్రీధర్ తెలిపారు.

# నగర భవిష్యత్ తరాలకు అనుగుణంగా మంచినీటి వసతులు: మంత్రి పొన్నం ప్రభాకర్






### తాగునీటి సరఫరా, వర్షాకాల సన్నద్ధత, భవిష్యత్ నీటి భద్రతపై మంత్రి సమీక్ష

### 2047 విజన్‌కు అనుగుణంగా నీటి ప్రాజెక్టుల పురోగతిపై చర్చలి

### వర్షాకాల నిర్వహణ, సీవరేజ్ వ్యవస్థల పనితీరుపై అధికారులకు దిశానిర్దేశం

**హైదరాబాద్, మే26 ( ప్రభాత ఉదయం)**

రోజురోజుకు విస్తరిస్తున్న హైదరాబాద్ ప్రజల కు మంచినీటి సరఫరా అందించేందుకు భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి , హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ వెల్ఫేర్ మంత్రి మహమ్మద్ అజరుద్దీన్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్ లతో కలిసి హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ సేవలు, వర్షాకాల సన్నద్ధత, కొనసాగుతున్న మౌలిక వసతుల పనులు, సీవరేజ్ నిర్వహణ, ఎస్టీపీల పనితీరు తదితర అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... 1989లో ఏర్పడిన జలమండలి పరిధి ప్రస్తుతం విస్తృతంగా పెరిగి టి సి యు ఆర్ ప్రాంతాల వరకు చేరిందన్నారు. నగరానికి ప్రస్తుతం కృష్ణా ఫేజ్ 1, 2, 3, గోదావరి, సింగూర్, మంజీర, హిమాయత్ సాగర్ తదితర వనరుల ద్వారా సుమారు 650 ఎం జి డి నీటి సామర్థ్యం అందుబాటులో ఉండగా, రోజువారీగా సుమారు 550 ఎం జి డి నీటి సరఫరా జరుగుతోందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి ఫేజ్-×× ఢ ××× ప్రాజెక్టులను రూ. 7 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. అలాగే 2047 విజన్‌కు అనుగుణంగా కృష్ణా ఫేజ్-×ఎ ఢ ఎ ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. పాత సింగూర్, మంజీర పైప్‌లైన్‌ల మార్పిడి పనులు కూడా ప్రారంభమైనట్లు వెల్లడించారు. జలమండలి పరిధిలో ప్రస్తుతం 14.5 లక్షల కనెక్షన్లు ఉండగా, అందులో 6.23 లక్షల కుటుంబాలకు ఉచిత తాగునీటి సరఫరా అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నగరంలో 15 వేల కిలోమీటర్లకు పైగా తాగునీటి నెట్‌వర్క్, 14 వేల కిలోమీటర్ల సీవరేజ్ నెట్‌వర్క్, 6 లక్షలకుపైగా మ్యాన్‌హోల్స్ ఉన్నాయని పేర్కొన్నారు. కొత్త మున్సిపల్ కార్పొరేషన్ల ఏర్పాటుతో జరిగిన డివిజన్ల పునర్వ్యవస్థీకరణ అనంతరం ఉచిత నీటి సరఫరా అమలుపై కూడ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. జిహెచ్ఎంసి పూర్వ పరిధిలోని అర్హులైన వినియోగదారులకు 20 కిలో లీటర్ల ఉచిత నీటి సరఫరా పథకం కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో మొత్తం 6.22 లక్షలకుపైగా వినియోగదారులు ఈ పథకం ప్రయోజనం పొందుతున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల మట్టాలు తగ్గిపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్యాంకర్ నీటి డిమాండ్ పెరిగినట్లు వెల్లడించారు. దీనికి అనుగుణంగా ఫిల్లింగ్ స్టేషన్ల సంఖ్యను 86 నుండి 96కు, ఫిల్లింగ్ పాయింట్లను 141 నుండి 167కు పెంచినట్లు తెలిపారు. ట్యాంకర్ల సంఖ్యను కూడా 1135 నుండి 1250కు పెంచినట్లు అధికారులు వివరించారు. జల ఫిర్యాదుల పరిష్కారానికి ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా వేగంగా స్పందిస్తున్నామని, ముఖ్యంగా ట్యాంకర్ సేవలకు సంబంధించిన ఫిర్యాదుల్లో 95 శాతం 24 గంటల్లో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 400 ఫ్రీ టాంకర్ లు సరఫరా చేస్తున్నామని అన్నారు.

**వర్షాకాల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి:**

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై కూడ మంత్రి సమీక్ష నిర్వహించారు. నగరంలోని నీటిమునిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని, డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణను సమర్థంగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. 2025లో 2916 కిలోమీటర్ల మేర సీవర్ లైన్ల డీ-సిల్టింగ్ చేపట్టినట్లు, 2.81 లక్షల మాన్‌హోల్స్ శుభ్రపరిచినట్లు అధికారులు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ శుభ్రత, మ్యాన్‌హోల్ క్లియరెన్స్, సిల్టింగ్ తొలగింపు, ట్రంక్ సీవరేజ్ లైన్‌ల నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సమస్యలను సమయానికి పరిష్కరించాలని సూచించారు. నగర విస్తరణతో పాటు తాగునీటి, సీవరేజ్ సేవలపై ఒత్తిడి పెరుగుతోందని, అందుకు అనుగుణంగా పైప్‌లైన్‌లు, స్టోరేజ్ పాయింట్లు, పంపిణీ వ్యవస్థలు, సీవరేజ్ నెట్‌వర్క్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

**భూగర్భ జలాల పెంపుకు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌కు ప్రాధాన్యం:**

భూగర్భ జలాల పెంపు కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, చెరువుల పునరుద్ధరణ, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి పేర్కొన్నారు. గత సంవత్సరం చేపట్టిన "ప్రతి ఇంటా ఇంకుడు గుంత" కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రదానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే నీటి సంరక్షణ సాధ్యమవుతుందని, ప్రతి ఇంటిలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వాటర్ హార్వెస్టింగ్ లేని ప్రాంతాల్లో ట్యాంకర్ సేవలపై ప్రత్యేక విధానాలు అమలు చేసే అవకాశముందని తెలిపారు. జలమండలి సేవలను మరింత సమర్థవంతంగా మార్చేందుకు అవసరమైన సిబ్బంది నియామకాలు, మౌలిక సదుపాయాల బలోపేతం, ప్రత్యేక నిధుల కేటాయింపుపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన తాగునీటి, సీవరేజ్ సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. అంతకుముందు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సమగ్ర నివేదికలను మంత్రికి సమర్పించారు. సమీక్షలో భాగంగా ట్యాంకర్ కార్యకలాపాల ప్రస్తుత పరిస్థితిపై అయన వివరించారు. భూగర్భ జలాల మట్టాలు తగ్గిపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్యాంకర్ నీటి డిమాండ్ పెరిగినట్లు వెల్లడించారు. నగరంలో కొనసాగుతున్న నీటి సరఫరా , మౌలిక వసతుల పనుల పురోగతిని కూడా మంత్రికి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో పరిధిలో అమృత్-2 పథకం కింద చేపట్టిన 39 ఎస్ టి పి ల నిర్మాణ పనులు, ప్యాకేజ్-1 కింద 16 ఎస్ టి పి ల, ప్యాకేజ్-2 కింద 22 ఎస్ టి పి ల పనుల పురోగతిపై వివరాలు అందించారు. ఈ సమీక్షా సమావేశంలో జలమండలి ఈడీలు సంతోష్, సామ్రాట్ అశోక్, డైరెక్టర్ టెక్నికల్ సుదర్శన్, డైరెక్టర్లు వినోద్ భార్గవ, నారాయణ, శ్రీనివాస రెడ్డి తో పాటు సీజీఎంలు, జీఎంలు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పానీపూరి తిని విద్యార్థులు అస్వస్థత

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 26(ప్రభాత ఉదయం)**

అయిజ పట్టణంలో పాత బస్టాండ్ సమీపంలో ఓ పానీపూరీ బండి వద్ద మంగళవారం పట్టణానికి చెందిన విద్యార్థులు పానీ పూరి తిని అస్వస్థతకు గురయ్యారు. బాధితులను అయిజ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. పానీపూరి బండిని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సమాచారం. జిల్లాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు లేకపోవడంతో తిను బండారాలపై నిఘా కొరబడిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదైన సంఘటన జరిగితే అధికారుల హడావుడి కనిపిస్తోందని మిగతా సమయాల్లో అధికారులు కనుచూపు మేర కనిపించరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫుడ్ సేఫ్టి అధికారులు మాముళ్లు మత్తులో మునిగిపోయారని, ప్రజల ఆరోగ్య భద్రతపై పర్యవేక్ష కొరబడిందని చెప్పుకోవచ్చు. జిల్లాలో అధికారులు ఉండి కూడా అవినీతి, అక్రమాలు అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపణలు వస్తున్నాయి.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికిపోయిన వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 2 6(ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల్ జిల్లా వడ్డేపల్లి మండల రెవెన్యూ పరిధిలో అవినీతి నిరోధక శాఖ (ఏసిబి)అధికారులు మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. భూమికి సంబంధించిన సర్వే నిర్వహించేందుకు ఒక బాధిత రైతు నుండి 10 వేల రూపాయలులంచం తీసుకుంటుండగా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్యను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డిఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వడ్డేపల్లి మండలంలోని ఒక రెతుకు సంబంధించి మొతం నాలుగు ఎకరాల పొలం సర్వే చేయడానికి ఎకరాకు రూ. 5000 చొప్పున మొత్తం 20 వేల రూపాయలు ఇవ్వాలని సర్వేయర్ బ్రహ్మయ్య రెతుపె ఒతిడి తీసుకువచ్చాడు. అడ్వాన్సుగా రూ. 5000 తీసుకున్నాడు. మొత్తం డబ్బులు ఇసేనే సర్వే చేసానని మొండికి వేయడంతో రెతు ఏసీబీ అధికారులకు సమాచారం అందించాడు. మంగళవారం మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ సారధ్యంలో వెళిన బృందం రెతు నుంచి 10 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా సర్వేయర్ ను పటుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కి తరలిస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.

## తెలంగాణలో అవినీతి రాజ్యం

### అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్

### శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్

### సింగరేణిలిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం

### కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మే 26 (ప్రభాత ఉదయం)**



తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూములు ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు స్మకమాలు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ. 16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో - సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.





# సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ: ఎమ్మెల్యే జిఎంఆర్

## సరళ సాగర్, కురుమూర్తి రాయ, నెల్విడి లిఫ్టులకు మోక్షం.

**కొత్తకోట, మే 26(ప్రభాత ఉదయం)**

సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ రైతుకు అండగా నిలుస్తుందనిదేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని ప్రధాన ఎత్తిపోతల పథకాలైన సరళ సాగర్, కురుమూర్తి రాయ, నెల్విడి లిఫ్టులను ఆయన అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం కాలక్రమేన శిథిలావస్థకు చేరిన ప్రాజెక్టులను పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు అన్నారు. ఆయకట్టు రైతులు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసిన ఇట్టి లిఫ్టులను పట్టించుకోలేదు తద్వారా పంటల సీజన్ లో లిఫ్టుల ద్వారా పంట పొలాలకు నీళ్లు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో.. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలో జియంఆర్ ఎత్తిపోతల పథకాలను స్వయంగా పరిశీలించి, దానికి సంబంధించిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం అందజేశారు. ఈ ప్రతిపాదనలపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం నేడు...సరళ సాగర్ లిఫ్ట్ పునరుద్ధరణకు 1 కోటి 94 లక్షల 20 వేలు,కురుమూర్తి రాయ లిఫ్ట్ పునరుద్ధరణకు 1 కోటి 45 లక్షల 20 వేలు,నెల్విడి లిఫ్ట్ పునరుద్ధరణకు 92 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... లిఫ్టుల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి , ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేశారు, అదేవిధంగా త్వరలోనే లిఫ్టుల పునరుద్ధరణ మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటామని రాబోయే వర్షాకాలం నాటికి లిఫ్టుల మరమ్మత్తులు పూర్తిచేసి ఆయకట్టు రైతాంగానికి నీరు అందించే ప్రయత్నం చేస్తామని తెలియజేశారు.






# అడ్డగోలు వెంచర్... పైగా వెంచర్ చుట్టూ ఇనుప కంచె

**నాలా ఫర్మిషన్ లేకుండానే ఇండ్ల నిర్మాణాల కోసం ప్లాట్లు అమ్మకాలు**

**ఇండ్లు కట్టుకున్నా నేటికి రైతుభరోసా డబ్బలు జమ**

**ఇండ్ల మధ్య ఉన్న కంచె తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన చర్యలు తీసుకోని వైనం**

**కంచె తొలగించాలని స్థానిక ప్రజాప్రతినిధి చెప్పినా బేఖాతర్**



**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 26(ప్రభాత ఉదయం)**

ఇదేదో పశ్చిమబెంగాల్ -బంగ్లాదేశ్ మధ్య ఉన్న అంతర్జాతీయ సరిహద్దు దృశ్యాలను తలపిస్తోంది. మొన్న బెంగాల్ లో ప్రభుత్వం మారి బార్డర్ లో కంచె నిర్మాణ పనులు చేపట్టింది. దానిని తలదన్నేల జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండల కేంద్రంలో ఓ భూ యజమాని ఇండ్ల మధ్య కంచె నిర్మాణం చేపట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారు.కేటిదొడ్డి మండల కేంద్రంలో రెండు సర్వేనంబర్ లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల చేసి విక్రయాలకు పాల్పడాడు. మరో సర్వేనంబర్ లో ఇండ్లు కట్టుకునే వారు తన సర్వేనంబర్ భూములో తిరగకుండా పటిష్టమైన కంచె నిర్మాణం చేశారు. దీంతో ఇండ్లు చుట్టూ కంచె నిర్మాణం ఏర్పాటు చేయడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. కంచె తొలగించాలని సదరు భూయజమానులను విన్నప్పించుకున్నా కనికరం చూపెట్టలేదు. స్థానిక ప్రజాప్రతినిధి దగ్గరకు వెళ్లిన కూఢా పంచాయతీ తెగలేదంటా. కొందరేమో మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎత్తుగడే ఈ కంచె నిర్మాణం అని ఆరోపిస్తున్నారు. మండల నాయకులు పంచాయతీ తెంపడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వెంచర్ వేసిటొల్లకు ఇనుప కంచెం నిర్మాణం చేయాలని ప్రభుత్వం ఏమి చెప్పలేదు. అనేక సంవత్సరాలుగా ఇండ్లు నిర్మించుకున్న కూడా ఆ సర్వే నంబర్ కు రైతు బందు పైసల్ పడుతునాయంటా. జిల్లా కలెక్టర్ కు, డిపిఓకు కంచె తొలగించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అధికారులు చర్యలు తీసుకోలేదు. చూద్దాం ఎన్ని రోజులు కంచె అలాగే పెడుతారో.

**నాలా ఫర్మిషన్ లేకుండానే...**

కేటిదొడ్డి మండల కేంద్రంలో సర్వేనెంబర్ 9అ, 10 అ లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల చేసి విక్రయాలకు ప్లాట్లు చేసి

అడ్డగోలుగా విక్రయించి, అటు ప్రభుత్వానికి, ఇటు కొనుగోలుదారులకు ఇక్కట్లకు గురి చేస్తున్నారు. అనుమతులు లేకుండానే వెంచర్లు వేశారు. నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అసెస్మెంట్ యాక్ట్)గా మార్చకుండానే క్రయ విక్రయాలు సాగింది.

వ్యవసాయ భూమిని వెంచర్గా మార్చాలంటే మొదటగా నాలా కన్వర్షన్ చేయించి డీటీసీపీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతులకు ప్రభుత్వానికి చలానా కట్టాల్సి వస్తుంది. ఇందుకోసం మార్కెట్ వాల్యూలో 6 శాతం స్టాంప్, డ్యూటీ రూపంలో కట్టాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీకి 10శాతం భూమిని కేటాయించి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ, పార్క్ను ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించాలి. కానీ ఇవేమీ లేకుండానే కేటిదొడ్డి మండల కేంద్రంలో అడ్డగోలుగా అగ్రిమెంట్ లతో ఇండ్ల నిర్మాణాల కోసం ప్లాట్లు చేసి విక్రయించారు. కేటిదొడ్డి మండల కేంద్రంలో సర్వేనెంబర్ 9అ, 10 అ లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల చేసి విక్రయాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికీ నాలా కన్వర్షన్ తీసుకోలేదని సమాచారం. ఆయా సర్వే నెంబర్లలో ఉన్న భూమి భూభారతీ పోర్టల్ ఇప్పటికే వ్యవసాయ భూములుగానే దర్శనమిస్తున్నాయి. కానీ వెంచర్ నిర్వాహకులు తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని చెబుతుండడం గమనార్హం. అయితే భూభారతీ పోర్టల్ లో వ్యవసాయ భూములని చూపిస్తుండడం, నాలా కన్వర్షన్ కాకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అయితే వెంచర్ నిర్వహకులు నాలా కన్వర్షన్ చేసుకొని, వెంచర్ కు అనుమతులు తీసుకుని ఉంటే భూభారతి పోర్టల్ లో వ్యవసాయ భూములని దర్శనమివ్వడం పై ప్లాట్ల కొనుగోలు దారుల్లో అయోమయం నెలకొంది. ఇప్పటికైనా అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## కార్యకర్తలు 'సర్'పై అవగాహన పెంచుకోవాలి

**కేటి దొడ్డి, మే 26(ప్రభాత ఉదయం)**

పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆదేశాల మేరకు మంగళవారం కేటిదొడ్డి మండల కొండాపురం గ్రామం లో బీజేపీ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలో 'సర్'(స్పెషల్ ఇంటోన్సివ్ రివిజన్-2026)పై మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావు హాజరై ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు, ఓట్ల మ్యాపింగ్పై ఏజెంట్లకు పూర్తి అవాగహన కల్పించే విధంగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలం ఓబిసి అధ్యక్షుడు ముంగిలి వీరేష్ , నాయకులు ఎర్ర భీమ్ రెడ్డి, అనిమిరెడ్డి, కొండాపూర్ ఉపసర్పంచ్ బీమ్ రెడ్డి, వార్డ్ మెంబర్ నారాయణ, అంపిరెడ్డి, తిమ్మారెడ్డి, సత్యపాల్, చిన్నబాబు, సుధాకర్, కే టి దొడ్డి వీరేష్, ఉమిత్యాల కొండన్న, రంగాపురం కృష్ణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ సమస్యలపై జోనల్ కమిషనర్‌తో చర్చించిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, మే 26 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ ను టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గ సమస్యల పైన, బుధవారం నియోజకవర్గంలో ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు పర్యటన ఉన్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపైన వారు చర్చించారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రమేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, తూము వేణు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కొప్పుశెట్టి దినేష్, గంధము రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## ముఖ గుర్తింపు రద్దు చేయాలి.. పాత పద్ధతినే కొనసాగించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 26 (ప్రభాత ఉదయం)**

గ్రామీణ ఉపాధి హామీలో పని చేసే కూలీలకు ముఖ గుర్తింపు పద్ధతిని రద్దుచేసి,పాత పద్ధతిలోనే హాజరు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం ధరూరు మండలంలోని రేవులపల్లి గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉపాధి కూలీలకు ఎటువంటి ముఖ గుర్తింపు హాజరు లేదని,కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విధానం వల్ల కొంతమంది ఫోటోలను కెమెరా తీసుకోకపోవడం వల్ల వారి హాజరును నమోదు చేయడం సాధ్యం కావడం లేదన్నారు. దీనివల్ల ఒక రేవులపల్లి గ్రామంలోనే సుమారు 65 మందికి పైగా కూలీలు ఉపాధికు దూరమవుతున్న పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఉపాధి కూలికి 305 రూపాయలు ఇస్తున్నామని చెబుతున్న,ప్రస్తుతం పని చేస్తున్న కూలీలకు 150 నుండి 200 రూపాయలకు మించి, కూలీల ఖాతాలో జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భీంపురం, యమునోనీపల్లి, పెద్దపాడు గ్రామాలలో ఉపాధి పనులను పున ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపి, పనులు జరగకపోవడానికి గల కారణాలను ఆరా తీసి, ప్రజలకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో వ్యవసాయ కార్మికుల మెరుగైన జీవన పరిస్థితులపై, రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభలు జూన్ 20న మహబూబ్ నగర్ లో జరుగనున్నాయని ఈ మహాసభలకు ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.అనంతరం రేవులపల్లి గ్రామంలో 9 మందితో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ గా జయలక్ష్మి కమిటీ సభ్యులుగా సుమలత, వై. సరళ, కుర్వ శివమ్మ, బొల్లెద్దుల తాయన్న, శ్రీరామ్, నరసింహ, బూడిద అయ్యమ్మ, సూరి లను ఎన్నుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పై ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

**కూకట్ పల్లి నియోజకవర్గంలో మీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులమీద శ్వేతా పత్రం విడుదల చేయాలి**

**పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి, మే 26 (ప్రభాత ఉదయం)**



కూకట్ పల్లి లో సోమవారం జరిగిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి మీద మాట్లాడిన పరుష పదజాలాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ... కృష్ణారావు హద్దులు దాటి మాట్లాడుతున్నాడు, ఇకనైనా పిచ్చి కూతలు కూయడం ఆపకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని, మీ తాటాక చప్పుళ్ళతో భయపడే రోజులు పోయాయి కాకి కూతలు మానుకోండి.. ప్రజలకు సేవ ఎలా చేయాలో నేర్చుకోండి. ప్రజలను తప్పుదోవ పట్టించేలా అబద్ధాలు ఆడుతున్నారని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. నోటిదురుసు ఉంది మరి మైక్ ఉంది కదా ఏది పెడుతే అది మాట్లాడడం సరికాదు అని అన్నారు. మీ హయాంలో జరిగిన 90% అభివృద్ధి పనుల మీద శ్వేతా పత్రం విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ అందులో భాగంగా హైదరాబాద్ ప్రగతి ప్రస్థానంలో సరికొత్త అధ్యాయం మొదలైందని గొప్ప చరిత్ర కలిగిన మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది అని అన్నారు. పరిపాలన సౌలభ్యం, వేగవంతమైన అభివృద్ధి కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించింది అని అన్నారు. ఇది ఎన్నికల అభివృద్ధి కాదు నిరంతరం కొనసాగే ప్రక్రియ కాంగ్రెస్ పార్టీ కమిట్మెంట్ అని అన్నారు.



## గుమ్మడిదల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తా : ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పటాన్ చెరు ఎమ్మెల్యే**

**పటాన్ చెరు, మే 26 ( ప్రభాత ఉదయం)**

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం, దోమడుగు, వీరన్న గూడెం, బొంతపల్లి, గుమ్మడిదలలో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు స్థానిక పాలకవర్గం సభ్యులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ప్రతి వార్డులో మౌలిక వసతులతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని వివిధ పరిశ్రమల సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెద్ద చింతరేవుల శ్రీఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న తహసీల్దార్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 26(ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలం పెద్ద చింతరేవులలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి వారిని మంగళవారం ధరూర్ మండల తహసీల్దార్ నందిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. ఆమె వెంట ఆలయ అర్చకులు బీమ్సేన్ చారి, ఆలయ కార్యనిర్వాహణాధికారి, ఆర్ ఐ నరసింహులు, వీఆర్వో రాజు ఉన్నారు.



## ప్రజలకు మేలు జరుగుతుందంటే పార్టీలకతీతంగా ముందుంటా

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, మే 26 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఖైతలాపూర్ లోని డబల్ బెడ్ రూమ్ ఇళ్లను మంగళవారం పరిశీలించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో అమృతనగర్ తండకు చేందిన 62 మందికి బుధవారం ఇళ్లు పంపిణీ కి సంబంధించి మౌలిక సదుపాయాలు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వంలో కూకట్ పల్లి నియోజకవర్గం లో బాలానగర్ చిత్తారమ్మ బస్తీలో, ఖైతలపూర్ లో మొట్ట మొదటగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు నిర్మించుకున్నాం అని, అయితే అమృతనగర్ తండా వాసులు కు గతంలో లాటరీ ద్వారా 67 మందికి ఇళు వచ్చాయని, మిగతా 62 మంది నిరుపేదలకు ఇక్కడే కేటాయించామని తెలిపారు. అలాగే స్థానికంగా ఉన్న ప్రజలకు 10% కేటాయించాలని విలేకరులకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించే విధంగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కి విజ్ఞప్తి చేశారు. ఫతేనగర్ లోని ఏ ప్రాంతంలో అయితే అమృత నగర్ తండావాసులు ఖాళీ చేశారో ఆ ప్రాంతంలో తిరిగి వారికే ఉపయోగపడే విధంగా ఆ భూమి వద్ద వారికి ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇవ్వాలని ఒకవేళ ఆ విధంగా చేయని పక్షంలో సిఎస్ఆర్ ఫండ్ ద్వారా నేనే నిర్మిస్తానని అన్నారు. నిరుపేదల విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలని, తాను ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటానని, ప్రజలకు మేలు జరుగుతుందంటే పార్టీలకతీతంగా తాను ఎప్పుడు ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, పండాలసతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు బిక్షపతి, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, ఎమ్మార్వో స్వామి, ఇంజనీరింగ్, హౌసింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608